క్లుప్తంగా

సీఐని కలిసిన నాయకులు



ములుగు రూరల్: ములుగు సీఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌ను శనివారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, జిల్లా సీనియర్ నాయకుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఇమ్మడి రాకేష్‌యాదవ్, దొంతిరెడ్డి రాకేష్‌రెడ్డి, నగరపు రమేశ్, పైడిమల్ల రవితేజ, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నేపథ్యంలో నేడు(ఆదివారం) ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు 'భూ భారతి'పై అవగాహన సదస్సు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో భూ భారతి చట్టంపై నేడు (ఆదివారం) అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌శర్మ, సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ హాజరవుతున్నారని తెలిపారు. రైతులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

ఇళ్లల్లోకి దుమ్మూధూళి

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి నిర్వహించే సరస్వతి నది పుష్కరాల కోసం ముమ్మరంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నిత్యం తిరుగుతున్నాయి. దీంతో గ్రామ పొలిమేర సబ్‌స్టేషన్ నుంచి గోదావరి తీరం వరకు ప్రధాన రహదారిపై ఇరువైపులా ఇళ్లలోకి దుమ్మూధూళి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై దుమ్ముదూళి లేవకుండా అధికారులు కనీసం నీటిని చల్లించడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి, పగలు రోడ్లపై రాకపోకలు సాగుతుండడంతో దుమ్ముతో ఇళ్లలో ఉండలేకపోతున్నమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి స్థానికులు టిప్పర్లు రోడ్లపై ఆపివేశారు. దీంతో ఎస్సై తమాషారెడ్డికి సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు ఫోన్‌చేయగా ఆయన వచ్చి మాట్లాడి యథావిధిగా వాహనాలు నడిచేలా ట్రాఫిక్ క్లియర్ చేశారు. కానీ సమస్య మాత్రం పరిష్కరం కాలేదు. వేసవి కావడంతో రాత్రి వేళ బయట నిద్రించాలన్నా దుమ్మూధూళితో శ్వాసకోశ సమస్యలు వస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత ఎండోమెంట్, పంచాయతీ, ఎన్పీడీసీఎల్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూస్ శాఖలతో పాటు పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి రోజు మూడుసార్లు రోడ్లపై నీటిని పట్టించాలని కోరుతున్నారు.

జోరుగా ఇసుక, మట్టి దందా!



మంగపేటలో ట్రాక్టర్‌తో తరలిస్తున్న మట్టి



గౌరారంవాగు నుంచి కమలాపురానికి ట్రాక్టర్‌తో తరలిస్తున్న ఇసుక

- పట్టపగలే సాగుతున్న రవాణా
- పట్టించుకోని అధికారులు

మంగపేట: మండలంలో మట్టి, ఇసుక దందా రోజురోజుకు మితి మీరుతోంది. పలువురు రెవెన్యూ అధికారులతో అంట కాగుతున్న కొందరు ట్రాక్టర్ యజమానులు మట్టి, ఇసుక దందాను వ్యాపారంగా ఎంచుకుని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినివస్తున్నాయి. కొందరు ట్రాక్టర్ల యజమానులు మట్టి, ఇసుక ట్రిప్పుకు కొంత రేటు నిర్ణయించి పలువురు రెవెన్యూ అధికారులకు ముడుపులుగా చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అధికారులు చూసి చూడనట్లు ఉండడంతో గృహ నిర్మాణాలు, స్థానిక అవసరాల పేరుతో సీసీరోడ్ల నిర్మాణం, ఇతర కాంట్రాక్టు పనులు, సిమెంటు బ్రిక్స్ తయారీ దారులకు మండల కేంద్రంలోని గౌరారంవాగు నుంచి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. అలాగే భూమి చదును పేరుతో మట్టికి అనుమతి తీసుకుని ఇతర ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతూ అవసరమైన వారికి దూరాన్ని బట్టి ట్రిప్పుకు రూ.8,00ల నుంచి రూ.1,000 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో తమను అడిగేవారు ఎవరనే ధీమాతో పట్ట పగలు ఇసుక, మట్టి దందా కొనసాగిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కాగా మట్టి, ఇసుక దందాపై శుక్రవారం కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా పలువురు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తక్షణమే స్పందించిన కలెక్టర్ విషయంపై తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఆరా తీసినట్లు తెలిసింది. తహసీల్దార్ కార్యాలయంలోని ఒకరిద్దరు అధికారులు వారికి అనుకూలంగా ఉండే కొందరు సిబ్బందితో ఈ తరహా దందా కొనసాగిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. ఉదయం 06 గంటల నుంచి సాయంత్రం 06 గంటల వరకు గౌరారంవాగు నుంచి పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచే ఇసుకను తరలిస్తుండటం విశేషం. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో పలువురు పెద్ద మొత్తంలో ఇసుకను డంప్ చేసి ఉంచుతున్నా పట్టించుకోక పోవడంపై పలు రకాల అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ ఇసుక, మట్టి దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

> **అక్రమంగా తరలిస్తే చర్యలు**
> ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుక, మట్టి అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటేనే అనుమతి ఇస్తున్నాం. అనుమతి తీసుకున్న వారు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తే అనుమతులు నిలిపి వేసి చర్యలు తీసుకుంటాం.
> – రవీందర్ తహసీల్దార్, మంగపేట

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం



ఎస్ఎస్ తాడ్వాయి: అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేట్ వేడుకల్లో విజయ

- ఇన్‌చార్జ్ సీడీపీఓ విజయ

ఎస్ఎస్‌తాడ్వాయి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం లభిస్తుందని ఇన్‌చార్జ్ సీడీపీఓ విజయ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో, తాడ్వాయి, నర్సింగాపూర్, ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నిర్వహించిన గ్రాడ్యుయేట్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్‌తోపాటు చిన్నారులకు ఆటలు, పాటలతో పాటుగా మేధో శక్తిని జ్ఞాపక శక్తిని పెంచే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన నిర్వహిస్తామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా తమ పాఠశాలలో అనేక రకాలుగా ఈవేంట్స్ నిర్వహిస్తూ ఆట బొమ్మలతో చిన్నారులను ఆడిస్తూ పాడిస్తూ విద్యను అందిస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులను తల్లిదండ్రులు చేర్పించి ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బండారి అనిల్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు ఇర్ప రజిత, జామునరాణి, రుక్మిణి పాల్గొన్నారు.

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక అన్నారు. కాటారం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ డే, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. అంకుషాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సీడీపీఓ హాజరై మాట్లాడారు. వెయ్యి రోజుల ప్రాముఖ్యత, జాగ్రత్తల గూర్చి గర్భిణులకు, బాలింతలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులకు నాణ్యతతో కూడిన ప్రీప్రైమరి విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు.

మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీడబ్ల్యూఓ మల్లేశ్వరి హాజరై మాట్లాడారు. మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, మాధవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి



లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం శనివారం వేలాది మంది భక్తజనంతో కిటకిటలాడింది. ఆలయంలోని స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు శేఖర్‌శర్మ, పవన్‌కుమార్, ఈశ్వర్‌చంద్ స్వామివారికి తిలతైలాభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తుల పేరిట ఆలయ పూజారులు గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టత, ఆలయ పురాణాన్ని భక్తులకు వివరించారు. సంతానం కోసం స్వామివారి నాభిచందన ప్రసాదం స్వీకరించేందుకు వచ్చిన దంపతులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని పంపిణీ చేసి వేద మంత్రోచ్ఛరణతో ఆశీర్వచనం ఇచ్చి దీవించారు.

అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ప్రత్యేక పూజలు

హేమాచలలక్ష్మీనర్సింహస్వామిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. వారి గోత్రనామాలతో స్వామివారికి ప్రత్యేక అర్చన జరిపించి శేషవస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



అదనపు కలెక్టర్‌ను శేషవస్త్రంతో సత్కరిస్తున్న అర్చకుడు పవన్‌కుమార్

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు షీల్డ్ అందజేస్తున్న ఇర్ప సునీల్

ఎస్ఎస్‌తాడ్వాయి: గ్రామీణ ప్రాంతంలోని యువత క్రీడల్లో రాణించాలని తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర అన్నారు. మండలంలోని వీరపూర్‌లో సమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారం రాత్రి ముగిసింది. కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర కార్యదర్శి కుంజ సూర్య సహకారంతో ప్రథమ విజేతలుగా నిలిచిన టీంకు రూ.15వేలు, ద్వితీయ టీంకు రూ.12వేల నగదుతోపాటు షీల్డ్‌లను మాజీ సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను పోత్సాహిస్తున్న కుంజ సూర్యను అభినందించారు. మాజీ సర్పంచ్ అశ్వినిసూర్యనారాయణ, ఉపసర్పంచ్ మోహన్, నాయకులు నారాయణ, గుమ్మడి ముత్తయ్య, సూర్యకాంతం, కృష్ణా, వెంకట నారాయణ, మోకాళ్ల వెంకటేశ్, బాలాజీ, తాటి నరేష్, వజ్జ నవీన్, రామారావు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ఘననివాళి



వెంకటాపురం(ఎం): కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



వాజేడులో..

వెంకటాపురం(ఎం): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులను స్మరిస్తూ శనివారం మండల కేంద్రంలో యువకులు పార్టీలకతీతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేశ రక్షణ కోసం యువకులమంతా సైనికుల్లా పనిచేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల యువ నాయకులు శెట్టి శ్రీధర్, రామిడి కర్ణాకర్‌రెడ్డి, బానోతు యోగి, గంగుల రాజ్‌కుమార్, మాదాసు రంజిత్, సాంబరాజు కిరణ్, గునిగంటి హరీష్, మంద రమేష్, ఎనబోతుల రాజేష్, దేశిని వీనీల్, ప్రేమేందర్, శ్రీకాంత్, నరేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి గ్రామంలో శనివారం రాత్రి యువకులు, గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పహల్గాంలో పర్యాటకులను ఉగ్ర వాదులు కిరాతకంగా హత్య చేయడాన్ని ఖండించారు. జానకు రమణ, భరత్, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

రేగొండ: కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన పర్యాటకులకు సంతాపంగా శనివారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు సూదనబోయిన ఓంప్రకాష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఆవుల మహేందర్, మాల మహానాడు మండల అధ్యక్షుడు పసుల రాకేష్, కాంగ్రెస్ నాయకులు పుట్ట రవి, ప్రేమాజీ, ఈర్ల శ్యామ్, పల్లెబోయిన తిరుపతి, జూపాక అశోక్, బొమ్మకంటి రవి, నంది విజయ్, కోడెల రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిట్యాల: మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. చదువు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, ఉపాధ్యాయులు యాదగిరి, రాజమౌళి, ముత్తయ్య, శైలజ, శంకర్‌షా, అనిల్, నవత, భగవాన్‌రెడ్డి, సదానందం, లతదేవి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్: ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టేకుమట్ల మండలం అంకుషాపూర్ గ్రామానికి చెందిన మేకల మహేందర్(26) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం లక్కారం గ్రామానికి వచ్చాడు. స్థానికంగా అద్దెకు ఉంటూ రిఫ్రిజిరేషన్ పని చేసుకుంటున్నాడు. ఆ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి గల కారణాలు తెలియలేదు. మృతుడి తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మన్మథకుమార్ తెలిపారు.


ముగిసిన హ్యాండ్‌బాల్ హంట్ టోర్నీ



ట్రోఫీ అందుకుంటున్న కాటారం బాలుర జట్టు

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ప్రారంభమైన నాయిని విశాల్‌రెడ్డి స్మారక 7వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ హంట్ అండర్ –15 బాలబాలికల పోటీలు శనివారం ముగిశాయి. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్‌బాల్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించగా, శనివారం జరిగిన ముగింపు వేడుకలకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్లకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకుడు, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 300ల మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్, ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్స్ సంఘం కోశాధికారి తోట శ్యామ్, తదితరులు పాల్గొన్నారు. కాగా, బాలికల విభాగంలో ఆసిఫాబాద్, బాలుర విభాగంలో కాటారం జట్లు విజేతగా నిలిచాయి.

పాండవుల గుట్టలో వసతులేవి?



పాండవుల గుట్ట ముఖ ద్వారం



మూతపడిన క్యాంటీన్

- టూరిజంగా గుర్తించినా అభివృద్ధిలో శూన్యం
- సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం
- ఇబ్బంది పడుతున్న పర్యాటకులు

రేగొండ: మండలంలోని తిర్మలగిరి శివారులో పర్యాటక ప్రాంతంగా విశేషంగా ఆకట్టుకుంటున్న పాండవుల గుట్టను అటవీ, ఎకో టూరిజం అధికారులు 2017లో పర్యాటక ప్రాంతంగా వెలుగులోకి తీసుకువచ్చారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు పాండవుల గుట్టను సందర్శిస్తున్నారు. ఎన్నో విశిష్టతలు కలిగిన పాండవుల గుట్టలో రాక్‌క్లైంబింగ్, రాపెల్లింగ్, ట్రెక్కింగ్, నైట్ క్యాంపెనింగ్, క్యాంప్ ఫైర్ వంటి కార్యక్రమాలకు ప్రసిద్ధి. తొండం గుండు, రాక్‌పెయింటింగ్, పలు జంతువుల చిత్రాలు, శిలాతోరణం వంటి రాతి చిత్రాలు సైతం పర్యాటకులను ఆకట్టుకుంటాయి. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దిన అధికారులు అభివృద్ధి చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. ప్రతీ శని, ఆది వారాల్లో రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్, రాపెల్లింగ్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సమేతంగా పాండవుల గుట్టకు వస్తుంటారు. వారికి కనీస అవసరాలు తీర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఏకోటూరిజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ మూడు సంవత్సరాలుగా నిరుపయోగంగా మారడంతో పర్యాటకులు ఆకలికి అలమటిస్తున్నారు. కనీసం మరుగుదొడ్లు కూడా వినియోగంలోకి తీసుకురాక పోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

మాటలకే పరిమితం

పాండవుల గుట్టను పర్యటించిన అధికారులు నిధులు కేటాయిస్తామని హామీలు ఇస్తూ అమలులో విఫలమవుతున్నారు. నైట్ క్యాంపెనింగ్ కోసం స్థలాన్ని కేటాయించి తగిన సౌకర్యాల కల్పనకు అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నిరాధారణకు గురవుతోంది. పాండవుల గుట్టను అభివృద్ధి చేస్తే జిల్లాకే పర్యాటకంలో తలమానికంగా మారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

> **నిరుపయోగంగా వాటర్ ప్లాంట్**
> పర్యాటకుల కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి కొన్ని రోజులు సేవలు అందించారు. సంవత్సరం క్రితం బోరు మోటార్ పాడవడంతో కనీసం తాగు నీరందించని స్థితిలో పర్యాటక ప్రాంతం ఉంది. మోటార్‌ను రిపేరు చేపించేందుకు నిధులను టూరిజం, అటవీ అధికారులు కేటాయించకపోవడం విడ్డూరం. దీంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ అలంకారప్రాయంగా మారింది.

పూరిల్లు దగ్ధం

చిట్యాల: మండలంలోని అందుకు తండాలో రాజయ్యకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం రాత్రి దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం రాజయ్య ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటల అంటుకున్నాయి. గ్రామస్తులు ఇంటిలో ఉన్న వృద్ధ దంపతులను బయటకు తీసుకువచ్చి మంటల ఆర్పివేశారు. రాజయ్య పది ఏళ్లుగా మంచానికి పరిమితమయ్యాడు. దీంతో చుట్టూ పక్కల వారిని బయటకు తీసి కాపాడారు. ఇంట్లోని బియ్యం, బట్టలు, వస్తువులు కాలిపోయాయని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు. ఈ మేరకు శనివారం సంఘటన స్థలానికి రెవెన్యూ అధికారులు సందర్శించి 25 కిలోల బియ్యం అందజేశారు.

పార్కింగ్ స్థలాల పరిశీలన



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి నిర్వహించే సరస్వతి నది పుష్కరాలకు వచ్చే వాహనాల కోసం పార్కింగ్ స్థలాలను అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. పలు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆమె వెంట డీఎల్‌పీఓ వీరభద్రయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ ప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణతో పాటు తదితరులు ఉన్నారు.